క్లుప్తంగా

నేటి నుంచి ఈటీసీలో టీఓటీలకు శిక్షణ

సామర్లకోట: పంచాయతీ కార్యదర్శుల పని తీరు మరింత మెరుగుపడేలా శుక్రవారం నుంచి శిక్షణ ప్రారంభిస్తున్నట్లు స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రం (ఈటీసీ) మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బ్యాచ్‌కు 40 మంది చొప్పున మూడు బ్యాచ్‌లలో 120 మంది టీఓటీలకు శిక్షణ ఉంటుందన్నారు. సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఈఓ పీఆర్డీలను టీఓటీలుగా ఎంపిక చేశామన్నారు. శుక్రవారం పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళంలోని టీఓటీలకు శిక్షణ ప్రారంభమవుతుందని చెప్పారు. శిక్షణ పొందిన టీఓటీలు ఆయా జిల్లాలకు వెళ్లి పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

కంప్యూటర్ విజ్ఞానంపై శిక్షణ


కంప్యూటర్‌పై శిక్షణ ఇస్తున్న లక్ష్మీదుర్గా భవాని

సామర్లకోట: మాధవపట్నం శివారు జమునా నగర్‌లో జనవిజ్ఞాన వేదిక, బాలమందిరం ఆధ్వర్యంలో చిన్నారులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో గురువారం కంప్యూటర్‌పై అవగాహన కల్పించారు. బాలమందిరం ఫ్యాకల్టీ అంగర లక్ష్మీదుర్గ భవాని కంప్యూటర్ ప్రాథమిక శిక్షణ నిర్వహించారు. బాలల పత్రిక, చిట్టి ఊహలు, అంశాలపై అవగాహన కల్పించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు


విఘ్నేశ్వరుని విగ్రహానికి వేద పండితులు, భక్తుల పూజలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కొత్తగా నిర్మించిన ఆలయంలో పురాతన విఘ్నేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి విగ్రహానికి శాంతి పూజలు జరిపారు. పలువురు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం నిర్వహించనున్నారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు వులవకాయల నాగలోవరాజు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మతల్లి జాతర

కొత్తపల్లి: స్థానిక గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి జాతర గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన గరగ నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అమ్మవారి తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కార్పొరేషన్ వాహనాలకు జీపీఎస్


వెహికల్ యార్డులోని వాహనాలను పరిశీలిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ: పారిశుద్ధ్య, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ పరిధిలో పని చేసే ప్రతి వాహనానికీ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్) అమలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈ ఎం.వెంకట్రావు, ఇతర అధికారులతో కలిసి బొందగుంటలోని వెహికల్ యార్డును గురువారం ఆయన సందర్శించారు. అక్కడ ఉన్న కంపాక్టర్లు, జేసీబీలు, సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లు సహా మొత్తం 59 వాహనాలు నిలిపే ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి వాహనాల స్థితిగతులపై ఆరా తీశారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా వాహనాల ఆవశ్యకత దృష్ట్యా అన్నింటినీ పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా ఈ వాహనాల కదలికలు, సమయాలను ఎప్పటికప్పుడు గుర్తించి పర్యవేక్షించేందుకు ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఆదేశించారు. వాహనాలకు జీపీఎస్ అమర్చడం వల్ల ప్రజలకు మరిన్ని సేవలు అందించగలమని కమిషనర్ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈ విరూపాక్షం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాజర్ తదితరులు ఉన్నారు.

జడ్జి నివాస భవనానికి రేపు శంకుస్థాపన

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో జడ్జి నివాస భవనానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ శనివారం శంకుస్థాపన చేయనున్నారు. స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి బొంగుళరి మధుబాబు గురువారం ఈ విషయం తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జి జస్టిస్ మల్లికార్జునరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తదితరులు పాల్గొంటారని చెప్పారు.


నాడు: ప్రమాదకరంగా కల్వర్టు



నేడు: కొత్తగా నిర్మించిన కల్వర్టు

ప్రగతి దారులు


నాడు: అధ్వానంగా రోడ్డు


నేడు: కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు


నిర్మాణంలో ఉన్న సీసీ డ్రైన్

- అమీనాబాద్‌లో సీసీ రోడ్లు, డ్రైన్లు 60 శాతం పూర్తి
- సుమారు రూ.80 లక్షలతో పనులు

కొత్తపల్లి: తీర గ్రామాల్లో ప్రగతి 'దారులు' పరచుకుంటున్నాయి. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సౌకర్యాల కల్పనతో అమీనాబాద్ గ్రామం అభివృద్ధి బాటలో పయనిస్తోంది. గతంలో ఏ గ్రామానికి వెళ్లినా పరిస్థితి అధ్వానంగా ఉండేది. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటు అభివృద్ధికీ పెద్దపీట వేశారు. టీడీపీ ప్రభుత్వ హయంలో చేయలేని ప్రగతిని నాలుగేళ్ల పాలనతో సాకారం చేస్తున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండు గ్రామ సచివాలయాలకు రూ.40 లక్షలు, గ్రామ పంచాయతీ, మండల పరిషత్ నిధులు సుమారు రూ.40 లక్షలతో పనులు జరుగుతున్నాయి. ప్రధాన రహదారుల్లో మురుగు నీటి సమస్యను నియంత్రించేందుకు రూ.40 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు ప్రత్యేక పైపులైన్లు సైతం ఏర్పాటు చేశారు. మరిన్ని నిధుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వీటికి కూడా ఆమోదం లభించి, త్వరలోనే నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి



అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం. టీడీపీ ప్రభుత్వ హయాంలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రగతి శూన్యం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామీణ రోడ్లు, ప్రధాన రహదారుల రూపురేఖలు మారిపోయాయి. గ్రామ పంచాయతీలో సుమారు రూ.80 లక్షలతో పనులు జరుగుతున్నాయి. గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కింద సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం జరుగుతోంది. – నక్కా మణికంఠబాబు, సర్పంచ్, అమీనాబాద్

ఇబ్బందులు తీరాయి

గతంలో సరైన రోడ్లు లేక ఇబ్బంది పడేవాళ్లం. వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వానంగా ఉండేది. వైఎస్సార్ సీపీ హయంలో రోడ్లు బాగు పడ్డాయి. మా తొలగిపోయాయి.
– చోడిపల్లి అప్పారావు, అమీనాబాద్

సత్తా చాటిన విద్యార్థినులకు అభినందనలు


జీఎస్ సౌజన్య


షేక్ ఆషాబేగం

పిఠాపురం: స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు జిల్లాలో అత్యధిక మార్కులు సాధించి తమ సత్తా చాటుకున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీలో జీఎస్ సౌజన్య 500కు 488, షేక్ ఆషా బేగం 480 మార్కులతో జిల్లాలోనే ప్రభుత్వ కళాశాలల్లో టాపర్లుగా నిలిచారు. వారిని కళాశాలలో గురువారం నిర్వహించిన సభలో ప్రిన్సిపాల్ పూటుకూరి కేశవరావు ప్రత్యేకంగా అభినందించారు. మంచి మార్కులు సాధించడానికి ప్రతి విద్యార్థీ వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల సభ వాయిదా

కొత్తపల్లి: అమీనాబాద్ తీర ప్రాంతంలో నిర్మిస్తున్న మేజర్ హార్బర్‌లో శనివారం నిర్వహించతలపెట్టిన జిల్లా స్థాయి మత్స్యకారుల సమ్మేళనాన్ని తుపాను హెచ్చరికల నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈ సభ నిర్వహించే తేదీని మరో నాలుగు రోజుల్లో ప్రకటిస్తామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ గురువారం తెలిపారు.

ధాన్యం చేరవేతలో దైన్యం


వీకే రాయపురం వద్ద ఏలేరు కాలువపై కాజ్‌వే పరిస్థితిని అధికారులకు వివరిస్తున్న రైతులు


ఆటోల్లో తెచ్చిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో మిల్లుకు తరలిస్తున్న రైతులు


సామర్లకోట మండలంలో ధాన్యం ఆరబెడుతున్న రైతులు

- వీకే రాయపురంలో రైతుల దుస్థితి
- మునిగిన కాజ్‌వేను పరిశీలించిన అధికారులు

సామర్లకోట: ఒకవైపు వర్షాలతో ధాన్యం తడిసిపోతుండగా.. ఆరబెట్టిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడం అన్నదాతకు తలకు మించిన భారం అవుతోంది. వీకే రాయపురం, బోయనపూడి గ్రామాల రైతుల పంట భూములు ఏలేరు కాలువ ఆవలి వైపు సుమారు 6 వేల ఎకరాల్లో ఉన్నాయి. రైతులు తమ పొలాలకు వెళ్లడానికి ఆ కాలువలో కాజ్‌వే నిర్మించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాజ్‌వే మునిగిపోవడంతో పాటు కొంత భాగం దెబ్బతింది. దీంతో వారు తమ ఉత్పత్తులను ట్రాక్టర్లు, ఎడ్లబళ్లపై కాకుండా ఆటోల్లో తీసుకువచ్చి, కాలువ దాటించి, ఆయా భారీ వాహనాలపై నింపి తరలించుకోవాల్సి వస్తోంది. ఇందుకు తమకు అదనంగా రూ.80 ఖర్చవుతోందని వారు అంటున్నారు. కాజ్‌వే మరమ్మతులను సిమెంటుతో కాకుండా గ్రావెల్‌తో చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతు సంఘం నాయకులు వెలమర్తి శ్రీనివాస్, ఇంటి రమేష్ చెప్పారు. దీంతో ఇందుకు ఖర్చు చేసిన రూ.6.5 లక్షలు నిరుపయోగమయ్యాయని అన్నారు.

ధాన్యాన్ని, కాజ్‌వేను పరిశీలించిన అధికారులు

రైతుల పొలాల్లో ఉన్న ధాన్యం సురక్షిత ప్రాంతాలకు చేరేలా చూడాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించడంతో డ్వామా ఏపీడీ వసంతమాధవి, ఎంపీడీఓ డి.శ్రీలలిత, వ్యవసాయాధికారి ఐ.సత్య మండల పరిధిలోని ధాన్యం రాశులను, పొలాలను పరిశీలించారు. దీనిలో భాగంగా వీకే రాయపురంలో కాజ్‌వే పరిస్థితిని వారు పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని ఎంపీడీఓ చెప్పారు. రైతుల వద్ద ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఆందోళన చెందవద్దని ఏపీడీ, ఎంపీడీఓ తెలిపారు. గురువారం ఉదయం నుంచి ఎండ రావడంతో రైతులు కొంత మేర ఊరట చెందారు. ధాన్యపు రాశులను ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి


తడిసిన పనలను చూపుతున్న రైతు

కొత్తపల్లి: మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని ఎంపీడీఓ అబ్రహం లింకన్, మండల వ్యవసాయాధికారి జోగారాజు రైతులకు సూచించారు. మండలంలోని వర్షాలకు దెబ్బ తిన్న వరి పంటను వారు పరిశీలించారు. తడిసిన వరి పనలను గట్లపై వేసుకొని, ఆరబెట్టుకోవాలన్నారు. నూర్చిన ధాన్యం క్వింటాల్‌కు కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి మొలక రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చేతికందివచ్చి, నీటి పాలవుతున్న పంటను కాపాడుకునేందుకు రైతులు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. ధాన్యపు రాశులను బరకాలతో కప్పి, వానకు తడిసిపోకుండా చర్యలు తీసుకుంటున్నారు.

'పవర్ ద ఫ్యూచర్'పై సెమినార్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగం, ఐఈఈఈ–పవర్ ఎనర్జీ సొసైటీ ఆధ్వర్యాన 'పవర్ ద ఫ్యూచర్' అనే అంశంపై గురువారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆసియా పసిఫిక్ రీజియన్ ప్రతినిధి డాక్టర్ కె.రామకృష్ణ పాల్గొన్నారు. ఐఈఈఈ ద్వారా స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీ ఉపయోగించడం వలన కెరీర్ పరిశోధన రంగాల్లో ఉండే అవకాశాలను వివరించారు. ఐఐటీలతో ఐఈఈఈకి ఉన్న ఎంఓయూ మాదిరిగానే జేఎన్‌టీయూకేతో ఇంటర్న్‌షిప్ అందించేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకునే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. 150 దేశాలు, 4 లక్షలకు పైగా సభ్యులున్న అంతర్జాతీయ సొసైటీగా ఐఈఈఈ విస్తరించిందన్నారు. అనంతరం వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు డాక్టర్ కె.రామకృష్ణను సత్కరించారు. ఐఈఈఈ ప్రతినిధి కె.సంతోష్, ఈఈఈ విభాగాధిపతి రవీంద్ర పాల్గొన్నారు.

బీమా.. కర్షకుడికి ధీమా

- ప్రకృతి కన్నెర్రజేస్తే ఆదుకునే పరిహారం
- ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా మంజూరు
- రైతుకు, కౌలుదారుకు రక్షణ కవచం



కరప: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రకృతి వివిధ రూపాల్లో తన్నుకుపోతుంటే అన్నదాతను ఆదుకునేవి పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలు. జరిగిన నష్టం నుంచి తేరుకోవాలంటే వీటిని తమ పనిలో భాగం చేసుకుని క్రమం తప్పకుండా సంబంధిత అధికారులను సంప్రదించి ఉపశమనం పొందవచ్చు. గతంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఉండేదికాదు. పంటల బీమా కూడా రైతులు పీఏసీఎస్‌లలో కానీ, వాణిజ్య బ్యాంకులలో కానీ తీసుకున్న పంట రుణాలకు బీమా ప్రీమియం కట్టించుకునేవారు. అధిక వర్షాలకు, తుపాన్లకు పంటపొలాలు ముంపునకు గురై నష్టం వాటిల్లితే పంట రుణం తీసుకున్న రైతులకే బీమా వర్తించేది. బ్యాంకులు, సొసైటీల్లో తీసుకున్న రుణాన్ని బట్టి బీమా శాతం లెక్క కట్టేవారు. కౌలు రైతుకు ఒక్క రూపాయి కూడా ముట్టేది కాదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వ్యవసాయం లాభసాటిగా చేయాలన్న సంకల్పం, ప్రకృతి వైపరీత్యాలు వస్తే రైతులను ఎలా ఆదుకోవాలో ఆలోచించి రైతుభరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ఏర్పాటు చేశారు. రైతులు ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించకుండా ప్రభుత్వమే రైతుల తరఫున చెల్లించి, ఉచిత పంటల బీమా అమలు చేస్తోంది. సాగు ప్రక్రియలో ఏ దశలో వైపరీత్యాలు సంభవించి నష్టం వాటిల్లినా ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసి రైతులను ఆదుకుంటున్నారు.

ఈ–క్రాప్, ఈ–కేవైసీ తప్పనిసరి

రైతుకైనా, కౌలు రైతులకైనా ఇన్‌పుట్ సబ్సిడీ రావాలన్నా, పంటల బీమా మంజూరు కావాలన్నా ముందుగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలి. ఆర్‌బీకే ద్వారా వీఏఏ లాగిన్‌లో రైతు తన వివరాలతో ఈ–క్రాప్ నమోదు చేయించుకుని, ఈ–కేవైసీ చేయాలి. ఆ తర్వాత వీఆర్‌ఓ దానిని నిర్ధారించాలి.

ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేదిలా..

ప్రకృతి విపత్తుల వల్ల జరిగిన నష్టాన్ని రైతు సదరు వివరాలను వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు తెలియజేయాలి. ఆ మేరకు వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టం నమోదు చేసి, ప్రభుత్వానికి నివేదిస్తారు. 33 శాతానికి పైబడి నష్టం వాటిల్లితే ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుంది.

పంటల బీమా ఇచ్చేదిలా..

పంటల బీమా రావాలంటే గతంలో మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఇచ్చేవారు. దీనివల్ల అన్నదాతకు అంతగా ఉపయోగం ఉండేదికాదు. ఇప్పుడు ఆర్‌బీకేలో ఈ–క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతుకు, కౌలు రైతుకు కూడా నష్టం వాటిల్లితే పంటల బీమా వర్తింపచేస్తున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఈ బీమా నిర్ణయిస్తున్నారు. అంటే ఒక సీజన్‌లో పంట పండించడానికి ఎంత పెట్టుబడి అవుతుందో లెక్కలు కట్టి, బ్యాంక్‌లు, సొసైటీల ద్వారా ఆ మేరకే పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. ప్రతి సీజన్‌లో కోతలకు ముందు నాలుగు పంటకోత ప్రయోగాలు చేస్తారు. అది కూడా కంప్యూటర్ ద్వారా ఆ గ్రామంలో ర్యాండమ్‌గా నాలుగు సర్వే నంబర్లు ఎంపిక చేసి, వ్యవసాయ శాఖకు తెలియజేస్తారు. ఏయే సర్వే నంబర్లలో పంటకోత ప్రయోగాలు చేయాలో సమాచారం వచ్చిన తర్వాత.. పంట కోతకు వచ్చిన వెంటనే వ్యవసాయాధికారులు ఆయా ప్రాంతాల్లో 5 చదరపు అడుగుల విస్తీర్ణంలో పంట కోసి, వచ్చిన ధాన్యం బరువు తూచి, తేమ శాతం తీసి ఎకరాకు ఎన్ని బస్తాలు (75 కిలోలు) దిగుబడి వస్తుందో లెక్క కడతారు. నాలుగు చోట్ల వచ్చిన సరాసరి దిగుబడిని యాప్‌లో రైతు పేరున నమోదు చేస్తారు. మండల పరిధిలోని గ్రామాల వారీగా వచ్చిన దిగుబడిని కలెక్టరేట్‌లోని స్టాటిస్టిక్స్ విభాగానికి, అక్కడి నుంచి ప్రభుత్వానికి నివేదిస్తారు. పంట దిగుబడి రావాల్సిన సగటు కంటే తక్కువగా వస్తేనే పంటల బీమా వస్తుంది. ఏ గ్రామంలో సగటు కంటే ఎంతమేర దిగుబడులు తగ్గాయో లెక్క కట్టి, ఒక ఎకరానికి మంజూరు చేయాల్సిన బీమా శాతాన్ని నిర్ణయిస్తారు. దాని ప్రకారం రైతుకు ఉండే విస్తీర్ణాన్ని బట్టి ఆయా గ్రామంలో జరిగిన నష్టతీవ్రతను బట్టి పంటలబీమా వస్తుంది.

బయటపడిన ఉపాధి సిబ్బంది బాగోతం

- బినామీ పేర్లతో మస్తర్ల సొమ్ము స్వాహా
- కూలీలు రాకుంటే బయటి కూలీలతో పనులు
- వేట్లపాలెంలో సిబ్బందిపై ఆరోపణలు


ఉపాధి సిబ్బంది నుంచి వివరణ తీసుకుంటున్న ఏపీడీ వసంత మాధవి

సామర్లకోట: మండల పరిధిలో మేజర్ పంచాయతీ వేట్లపాలెంలో ఉపాధి సిబ్బంది అవినీతి గురువారం బయట పడింది. గ్రామానికి చెందిన బి.వీర వెంకట సత్యనారాయణ ఉపాధి హామీ సిబ్బంది అవినీతిపై విచారణ చేయాలని ఇటీవల డ్వామా పీడీ, ఎంపీడీఓలకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. గత పాలకుల సూచనల మేరకు ఉపాధి హామీలో అవకతవకలు జరిగాయని ఆయన ఫిర్యాదు చేశారు. దీంతో డ్వామా ఏపీడీ వసంత మాధవి ఆధ్వర్యాన పంచాయతీ కార్యాలయం వద్ద సుమారు నాలుగు గంటల పాటు విచారణ నిర్వహించారు. గ్రామంలోని ఉపాధి హామీ మేట్లు బినామీ పేర్లతో మస్తర్లు వేసి, సొమ్ము స్వాహా చేశారని తెలిపారు. దీనిపై మేట్లను ఏపీడీ ప్రశ్నించారు. ఉపాధి హామీ కూలీలు రాని సమయంలో బయటి కూలీలతో పని చేయించినట్లు కొంతమంది మేట్లు అంగీకరించారు. అలాగే ఉపాధి హామీ నిధులతో గ్రామంలోని పేదలకు మరుగుదొడ్లు నిర్మించకుండా నిధులు స్వాహా చేశారని ఉపాధి కూలీలు, గ్రామస్తులు ఆరోపించారు. మరుగుదొడ్లకు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందినట్టు ఉండటంతో ప్రస్తుతం జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి బ్యాంకు నుంచి రుణం రావడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి విచారణ చేసి న్యాయం చేయాలన్నారు. మేట్లపై చర్య తీసుకునే అంశాన్ని పీడీ దృష్టికి తీసుకువెళ్తామని వసంత మాధవి తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఏపీఓ ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గోలి బాబ్జీ, నిడదవోలు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ లబ్ధి


ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు
- పెద్దాపురంలో గడప గడపకూ..

పెద్దాపురం: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెద్దాపురం 14వ సచివాలయం పరిధిలోని 24, 26వ వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయరు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బందితో కలసి గురువారం ఆయన గడప గడపనూ సందర్శించారు. లబ్ధిదారులకు అందిన పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. దొరబాబు మాట్లాడుతూ పార్టీ రహితంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ఈ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్ పేరింశెట్టి అంబిక, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, నల్లల గోవిందు, సుందరెడ్డి రాజు, లక్కాకుల కృష్ణ, చింతా శ్రీనివాసరావు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లాల్లో ధాన్యం పరిశీలన


పెనుగుదురులో రైతులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీఓ సీతారామారావు

కరప: మండలం పెనుగుదురులో కాకినాడ ఇన్‌చార్జి ఆర్డీఓ జె.సీతారామారావు గురువారం పర్యటించారు. లే అవుట్లలోని ధాన్యం కళ్లాలను పరిశీలించారు. రైతులు ధాన్యం మొలకలు రాకుండా ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని చెప్పారు. దళారుల మాయమాటలు నమ్మకుండా వ్యవసాయ, రెవెన్యూ అధికారులను, ఆర్‌బీకేలను సంప్రదించి తగిన సలహాలు తీసుకుని, ధాన్యం విక్రయించాలని సీతారామారావు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంఏఓ ఏవీ రాజేష్, ఆర్ఐ పేపకాయల మాచరరావు, వీఆర్ఓ పి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహ జయంతి

తుని రూరల్: కుమ్మరిలోవలోని తపోవనం సచ్చిదానంద ఆశ్రమంలో నృసింహ జయంతిని గురువారం వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి మహాస్వామి ఆధ్వర్యాన వేద పండితులు, వేద విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. నృసింహారాధన, వేద పారాయణ, భాగవత పారాయణ, సర్వరక్షాకర నృసింహ అనుష్టుప్ హోమం, మహా సుదర్శన హోమం, సహస్ర కమలార్చన, తులసీ అర్చన నిర్వహించారు. నృసింహ స్వామిని భక్తి భావంతో కొలిచే వారికి సుఖశాంతులు ప్రాప్తిస్తాయని స్వామీజీ అన్నారు. నృసింహ జయంతి సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలో వివిధ రంగులతో స్వామివారి రూపాలు తీర్చిదిద్దారు.